APTEL/2015/65279

Postal Reg.No. MPM/L22/VNEWS/22-24

# V న్యూస్

మన ఊరు - మన వార్తలు

తెలుగు దినపత్రిక

e-mail : vnewsmachilipatnam@gmail.com
e-mail : vnewsindia@gmail.com

సంపుటి :9 సంచిక : 226 మచిలీపట్నం, విజయవాడ, కాకినాడ, గుంటూరు, ఖమ్మం, వైఎస్ఆర్ కడప, ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు 21-01-2023 శనివారం పేజీలు :4 వెల : రూ.3/-
















# అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం టైంకి పూర్తవ్వాలి : సీఎం జగన్

**అమరావతి :** విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ స్మృతివనం, అందులో ఏర్పాటు చేయనున్న భారీ విగ్రహ పనులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విగ్రహం తయారీ, దానిచుట్టూ చేపట్టిన సివిల్ వర్క్స్, సుందరీకరణ, మైదానాన్ని ప్రధాన రహదారితో అనుసంధానం చేసే తదితర అంశాలపై ఆయన అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ క్రమంలో.. పనుల తీరును సీఎం జగన్‌కు అధికారులు వివరించగా.. ఆయన పలు కీలక సూచనలు చేసినట్లు తెలుస్తోంది.



విగ్రహ పీఠంతో కలుపి మొత్తంగా అంబేదర్క్ విగ్రహం 206 అడుగుల పొడవు వస్తుందని అధికారులు సీఎం జగన్‌కు వివరించారు. అంబేద్కర్ స్మృతివనం ప్రాజెక్టు వ్యయం మొత్తంగా రూ.268 కోట్లు కాగా, పీఠం భాగంలో జీ ప్లస్ టూ నిర్మాణం ఉంటుంది. అలాగే.. ప్రాంగణంలో ఒక కన్వెన్షన్ సెంటర్ కూడా రానుంది. విగ్రహ నిర్మాణంలో 352 మెట్రిక్ టన్నుల ఉక్కు, 112 మెట్రిక్ టన్నుల ఇత్తడిని వినియోగిస్తున్నారు. మార్చి నెలాఖరు కల్లా విగ్రహ నిర్మాణ పనులు పూర్తిచేస్తామన్న అధికారులు.. జనవరి 31 కల్లా విగ్రహానికి సంబంధించి కాస్టింగ్ చేసిన భాగాలన్నీ తరలించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు జరిగాయని తెలిపారు.

ఇప్పటికే కొన్ని విగ్రహ భాగాలను తరలించామన్న అధికారులు.. దాదాపు 2 వేల మంది పట్టేలా కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మిస్తున్నామని వెల్లడించారు. కార్ పార్కింగ్, బస్ పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించామని, అలాగే అంబేద్కర్ స్మృతి వనానికి దారితీసే రోడ్లను సుందరీకరిస్తామని తెలిపిన అధికారులు.

అధికారుల వివరణకు సీఎం జగన్ స్పందిస్తూ.. ప్రాజెక్టును వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. నిర్దేశిత సమయంలోగా అన్ని పనులు పూర్తిచేయాలని, నాణ్యత విషయంలో అస్సలు తగ్గొద్దని, అలాగే నిర్మాణాలు అందంగా ఉండాలని సూచించారు. పనుల పర్యవేక్షణకు ఉన్నతస్థాయి అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం జగన్ అధికారులకు సూచించారు.

## కోర్టు ఆదేశించినా నిర్మాణాలు చేపట్టడం అక్రమమే కదా : ఏపీ హైకోర్టు

**అమరావతి :** రాష్ట్రంలోని పాఠశాలల ప్రాంగణాల్లో కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు నిర్మించడంపై హైకోర్టు విచారణ చేపట్టింది. సచివాలయాల నిర్మాణాలపై హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఇప్పటికే నిర్మించిన సచివాలయాలు, కొన్ని ఆర్బీకే భవనాలను సంబంధిత పాఠశాలలకు అప్పగించామని.. మిగిలిన వాటిని అప్పగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు




తెలిపారు.

వాదనలు విన్న ధర్మాసనం స్పందిస్తూ.. "నిర్మాణాలు నిలుపుదల చేయాలని కోర్టు ఆదేశించినా భవనాలు కట్టడం అక్రమమే అవుతుంది కదా.. గతంలో ప్రజావేదిక కూడా ప్రజల డబ్బుతో నిర్మించిందే. ప్రజలకు ఉపయోగపడేలా వినియోగించాల్సింది పోయి కూల్చేశారు. అప్పుడొక వైఖరి.. ఇప్పుడు మరోలా చేస్తే ఎలా?" అని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రజల సొమ్ముతో నిర్మించి నందున ఆయా పాఠశాలల అవస రాలకే వినియోగి ంచేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం ఈనెల 24కి వాయిదా వేసింది.

## జీవో నంబర్ 1పై ప్రస్తుత పరిస్థితుల్లో జోక్యం చేసుకోలేం

### - సుప్రీంకోర్టులో ముగిసిన విచారణ

**ఢిల్లీ :** ఏపీలో రహదారులపై రోడ్డుషోలు, సభలు, సమావేశాల నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1పై విచారణ ముగిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. ఆ జీవోను నిలిపివేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం విచారణ చేపట్టింది.



ప్రస్తుత పరిస్థితుల్లో జీవో నంబర్ 1పై జోక్యం చేసుకోలేమని.. ఏపీ హైకోర్టు సీజే ధర్మాసనం దీనిపై విచారణ చేపడుతుందని సీజేఐ ధర్మాసనం తెలిపింది. వాద, ప్రతివాదులిరువురూ డివిజన్ బెంచ్ ముందు అన్ని అంశాలు ప్రస్తావించుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈనెల 23న జీవో నంబర్ 1పై విచారణ చేపట్టాలని హైకోర్టుకు సూచించింది.

## పాస్‌పోర్టు పోయినది

గుడ్లవల్లేటి పవన్‌కుమార్ S/0 వెంకటరత్నం డో.నెం:8/11-ఎ. గొడుగుపేట, మచిలీపట్నం., కృష్ణాజిల్లా. ఆంధ్రప్రదేశ్ వాస్తవ్యుడను. నా పేర T5212388 పాస్‌పోర్టు ఉన్నది. ది.15.1.2023న మా ఇంటి నుంచి జవ్వారుపేటలోని మా బంధువుల ఇంటికి వెళ్తుండగా నా పాస్‌పోర్టు పోయినది. ఈ పాస్‌పోర్టు ఎవ్వరికైనా దొరికిన ఎడల నాకు అందజేయగలరు. తగు పారితోషికం ఇవ్వగలను.దొరికిన వారు ఈ కింది చిరునామాకు తెలియజేయగలరు.

సంప్రదించండి

గుడ్లవల్లేటి పవన్‌కుమార్,వెంకటరత్నం, డోనెం:8/11-ఎ, గొడుగుపేట, మచిలీపట్నం. సెల్:7981149511

# ఎంఎల్‌సి ఆశావహుల్లో...రొండి, మాదివాడ

### -మార్చి నెలాఖరులోగా ఖాళీ కానున్న ఎంఎల్‌సి స్థానాలపై అందరి దృష్టి

**(మచిలీపట్నం):** మార్చి నెలాఖరులోగా ఎంఎల్‌సి స్థానాలు పెద్ద సంఖ్యలో ఖాళీ కానున్నాయి. దాదాపుగా 22 ఎంఎల్‌సి స్థానాలు ఖాళీ కానున్నాయి. అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఎంఎల్ఎ ల సంఖ్య 151 ఉన్న నేపథ్యంలో దాదాపుగా అన్నీ ఎంఎల్‌సి స్థానాలు వైకాపాకే దక్కే అవకాశం ఉంది. దీంతో వైకాపాలో ఎంఎల్‌సి స్థానాల కోసం పోటీ ఎక్కువైంది. ఎవరికి వారు తమ అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో పడ్డారు. కులాల లెక్కలు, కూడికలు తీసివేతల పనిలో నేతలు ఉన్నారు.

వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంఎల్‌సి స్థానాల భర్తీలో ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వారికే కేటాయించారు. మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో ఏ వైకాపా నాయకుడికి ఎంఎల్‌సి స్థానం దక్కలేదు. దీంతో ఈ దఫా ఎంఎల్‌సి స్థానాల భర్తీలో ఖచ్చితంగా మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో కేటాయించే అవకాశం కనిపిస్తోంది. దీంతో మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో వైకాపా నాయకులు ఎక్కువ ఆశలు పెట్టుకున్నారు.



**ఆశావహుల్లో ఎవరికి లక్కీఛాన్స్ దక్కేనో..!**

మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో(కృష్ణాజిల్లా) ఎంఎల్‌సి స్థానం ఎవరికి దక్కుతుందోననే చర్చ జోరుగా సాగుతోంది. వైకాపా పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న మచిలీపట్నంకు చెందిన మాదివాడ రాము కాపు కోటాలో ఎంఎల్‌సి స్థానం ఆశిస్తున్నారు. వైకాపా ఆవిర్భావం నుంచి ఉండటం, కాపు సామాజికవర్గంనకు చెందిన వాడు కావడం, స్థానిక ఎమ్మెల్యే కన్నా ముందే వైకాపాలో చేరడం, తదితర అంశాలు మాదివాడ రాముకు పాజిటివ్‌గా ఉన్నాయి. అయితే స్థానిక ఎమ్మెల్యే పేర్ని నాని కూడా కాపు సామాజికవర్గానికి చెందిన వాడు కావడం మైనస్. పార్టీ అధికారంలోకి వచ్చాక ఏ పదవి మాదివాడ రాముకు దక్కకపోవడం ఆయన ఎంతగా బాధపడుతున్నారో తెలియదు కాని వైకాపా ఆవిర్భావం నుంచి వైకాపా జెండాను రెపరెపలాడించిన రాము అన్నకు ఏ పదవి రాలేదని అందరూ అనుకోవడం మచిలీపట్నం నియోజవకర్గ పరిధిలో చర్చనీయంశమే. ఆయన్ని చూడగానే పార్టీ అధికారంలోకి వచ్చినా రాముఅన్న నీకు పదవి ఏది ఇవ్వలేదేంటన్నా అని ఆప్యాయంగా అడిగే వారే ఎక్కువ అంటే అతిశయోక్తి కాదు. ఇక అదేవిధంగా యాదవ సామాజికవర్గానికి చెందిన రొండి కృష్ణ యాదవ్ ఎంఎల్‌సి దక్కుతుందనే భావనలో ఉన్నారు. మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దాదాపుగా 3లక్షల యాదవ ఓట్లు ఉన్నాయనే లెక్కలు ఉన్నాయి. పదేళ్ల పాటు కృష్ణాజిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్‌గా పనిచేసిన రొండి కృష్ణ యాదవ్‌కు ఉమ్మడి కృష్ణాజిల్లాలో విస్తృత పరిచయాలు ఉన్నాయి. యాదవ సామాజికవర్గంపై పట్టు ఉంది. మరోవైపు చూస్తే గతంలో జిల్లా అధ్యక్షుడుగా యాదవ సామాజిక వర్గానికి చెందిన కొలుసు పార్ధసారధి ఉండే వారు. ఇటీవల పార్టీ ఆయనను తప్పించి మాజీ మంత్రి పేర్నినానిని నియమించింది. అలాగే సీనియర్ అయిన కొలుసు పార్ధసారధికి మంత్రి పదవి దక్కుతుందని 2019లో వైకాపా ప్రభుత్వం ఏర్పడేటపుడే అందరూ లెక్కలు వేశారు. ఆతర్వాత మంత్రివర్గ పునర్వవస్ధీకరణలో దక్కుతుందని భావించినా యాదవులకు నిరాశే దక్కింది. దీంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో యాదవ సామాజికవర్గంలో అసంతృప్తి నెలకొంది. జిల్లాలో బలమైన ఓటు బ్యాంకు గల యాదవ సామాజికవర్గంలో నెలకొన్న అసంతృప్తిని తొలగించాలంటే యాదవ సామాజికవర్గానికి ఎంఎల్‌సి స్థానాన్ని కేటాయించాలనే ఆలోచన వైకాపాలో వినిపిస్తుంది. అలాగే యాదవ సామాజికవర్గ నాయకులు కూడా ఖచ్చితంగా యాదవులకు ఎంఎల్‌సి స్థానం కేటాయించాలని కోరుతున్నారు. మార్చి 29న ఎంఎల్‌సిగా రిటైరవుతున్న బచ్చుల అర్జునుడు కూడా యాదవ సామాజికవర్గానికి చెందిన వారేనని ఆయన స్థానంలో ఖచ్చితంగా యాదవులకే ఎంఎల్‌సి స్థానం కేటాయించాలని యాదవ సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇక వైకాపా అధిష్టానవర్గం ఏ లెక్కలు వేస్తుందో.. ఎవరిని నియమిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

## పాకిస్థాన్ ఒంటరైంది.. ఉగ్రవాద మూలాలను ప్రపంచం తెలుసుకుంది

**ఘాజీపుర్:** పాకిస్థాన్ ఒంటరైపోయిందని, ఉగ్రవాదం ఎక్కడ నుంచి పుట్టుకొచ్చిందో ప్రపంచ దేశాలు కూడా అర్థం చేసుకున్నాయని భాజపా చీఫ్ జేపీ నడ్డా పేర్కొన్నారు. పార్టీ అధినేతగా మరోసారి ఎన్నికైన ఆయన.. మాజీ సైనిక ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మన విదేశీ విధానాన్ని ప్రశంసించిన నడ్డా.. భద్రతా దళాలకు మద్దతుగా ఉందన్నారు.

'ప్రపంచంలో పాకిస్థాన్ ఒంటరైంది. ఎందుకంటే.. ఉగ్రవాదం ఎక్కడ మొదలైందనే విషయాన్ని ప్రపంచం అర్థం చేసుకుంది. అంతేకాకుండా ఉగ్రవాదంపై భారత్ ఎలా పోరాడిందో కూడా ప్రపంచం తెలుసుకుంది' అని జేపీ నడ్డా పేర్కొన్నారు. ఇక భారత ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించిన ఆయన.. ప్రధాని దీపావళి కూడా జవాన్లతోనే చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. దేశాన్ని రక్షించుకోవడం కోసం ప్రధానమంత్రి ఎన్నో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారని.. ఈ క్రమంలో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యంగా మనది పరిగణించబడుతున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఎటువంటి సంక్షోభం వచ్చినా.. మనతోపాటు సరిహద్దులను భారత జవాన్లు రక్షిస్తున్నారని అన్నారు.

గత ప్రభుత్వాలు రక్షణశాఖను బలహీనం చేశాయని ఆరోపించిన నడ్డా.. యుద్ధవిమానాలు, ఆయుధాలతోపాటు చివరకు జవాన్లు వేసుకునే బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లలోనూ అవినీతికి పాల్పడ్డారని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరంపైనా విమర్శలు గుప్పించారు. వన్ ర్యాంకు వన్ పెన్షన్ పథకానికి ఆయన రూ.500కోట్లు కేటాయించి అవమానించారని.. కానీ తమ ప్రభుత్వం మాత్రం రూ.35వేల కోట్లు ఇచ్చిందన్నారు.

# V న్యూస్

## ఇది న్యాయం కోసం దంగల్

ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడల లాంటి అంతర్జాతీయ వేదికలపై దేశానికి పతకాలు సాధించి వార్తల్లో వ్యక్తులుగా నిలవడం ఆ కుస్తీ ప్రవీణులకు అలవాటు. కానీ, ఇప్పుడు పూర్తి భిన్నమైన పరిస్థితుల్లో వారు, వారి ఆట వార్తల్లోకి ఎక్కాయి. భారత రెజ్లింగ్ సమాఖ్య పైన, దాని అధ్యక్షుడైన పాలక బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ వికృత వ్యవహారశైలి పైన ధ్వజమెత్తుతూ ఢిల్లీ నడిబొడ్డున బుధవారం నుంచి రెండు రోజులుగా 30 మందికి పైగా మహిళా రెజ్లర్లు నిరసనకు దిగేలా చేశాయి.

అంతా కలిపి 200 మందికి పైగా అథ్లెట్లు నిరసనకు దిగడం, అనేక సంగతులు బయటపెట్టడం భారత క్రీడా చరిత్రలో మునుపెన్నడూ చూడని దృశ్యం. ముక్కున వేలేసుకొనేలా సందర్భం. కామన్వెల్త్ క్రీడోత్సవాల్లో మూడుసార్లు స్వర్ణాలు సాధించిన వినేశ్ ఫోగాట్ కన్నీరు పెట్టుకుంటూ మహిళా అథ్లెట్లు ఎదుర్కొంటున్న దారుణాల్ని వివరిస్తుంటే గుండె మండిపోతుంది. అన్షూ మలిక్ లాంటి వారు బయటపెట్టిన సంగతులు ఆవేదన రేపుతాయి. సాక్షీ మలిక్, బజ్‌రంగ్ పునియా %--% ఇలా స్త్రీ పురుష తేడా లేకుండా అందరూ జరుగుతున్న అన్యాయాలను కెమెరాల సాక్షిగా ఏకరవు పెట్టాల్సి వచ్చింది.

మహిళా రెజ్లర్లుండే హొటల్‌లోనే బస చేయడం, వారు గది దాటి స్వేచ్ఛగా బయటకు రావడానికైనా వీల్లేకుండా తన గది తలుపులు సదా తీసి ఉంచి, తన రోజువారీ పనులు చేసుకోవడం%--% ఇదీ సమాఖ్య అధ్యక్షుడి తీరు. ఇది నియమానుసారమే కాదు నైతికంగానూ సరికాదు.

బ్రిజ్ గత చరిత్రా గొప్పదేమీ కాదు. గతంలో ఆయన నేరసామ్రాజ్య నేత దావూద్ ఇబ్రహీమ్ బృందానికి సాయపడ్డారట. ఆ కేసులో తీవ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం కింద అరెస్టయ్యారు. దౌర్జన్యానికి మారుపేరై, ఇప్పటికి 6 సార్లు ఎంపీగా గెలిచారు. 2011 నుంచి పుష్కర కాలానికి పైగా కుర్చీలో ఉంటూ, కుస్తీ సమాఖ్యను సొంత జాగీరుగా మార్చుకొన్నారు.

ఆటను అడ్డంపెట్టుకొని అవి నీతి, అక్రమాలు, వేదికపై ఆటగాళ్ళను చెంపదెబ్బ కొట్టిన దౌర్జన్యాలు, అథ్లెట్లతో అనుచితవర్తనలు... ఇలా ఈ రాజకీయవాది ఘనతల చిట్టా సుదీర్ఘమైనది. సొంత ఊరు లక్నోలో, స్వగృహానికి దగ్గర లోనే సదా మహిళా అథ్లెట్ల శిబిరం పెట్టి, తానూ హాజరయ్యే మనోడి గురించి ఎంత చెప్పినా తక్కువే.

క్రీడావ్యవస్థలో ఇలాంటి దుష్టసంస్కృతి చిరకాలంగా ఉన్నదే. ఇటీవల ఏడు నెలల క్రితం కూడా అగ్రశ్రేణి భారత సైక్లింగ్ క్రీడాకారిణి ఒకరు తమ నేషనల్ టీమ్ కోచ్ నుంచి ఇలాంటి వేధింపులే ఎదుర్కొన్నారు. స్లొవేనియాలో క్రీడా శిక్షణా శిబిరంలో కోచ్ అనుచిత ప్రవర్తనపై ఆమె ఏకంగా 'భారత క్రీడా ప్రాధికార సంస్థ' (శాయ్)కు ఫిర్యాదు చేయాల్సి వచ్చింది.

ఇటీవలే హర్యానాలో ఓ మహిళా కోచ్ స్వయానా ఆ రాష్ట్ర క్రీడా మంత్రి లైంగిక అత్యాచార పర్వాన్ని బట్టబయలు చేయడం గమనార్హం. ఇంకెన్నో వెలుగులోకి రాని ఫిర్యాదులున్నాయి. ఓ సినీ నటుడి అనుచిత ప్రవర్తనను ఒక హిందీ నటి బయటపెట్టే సరికి, తీగ లాగితే డొంకంతా కదిలినట్టు భారత్‌లో 'మీ టూ' ఉద్యమస్థాయికి చేరిన సంగతి 2018లో చూశాం. ఇప్పుడు కుస్తీ సమాఖ్య సారథి సహా కోచ్‌లపై లైంగిక వేధింపుల ఆరోపణ ఆట వెనుక దాగిన చీకటి కోణాన్ని బయటపెట్టింది.

నాలుగు పర్యాయాలు ఒలింపిక్ పతకాలు తెచ్చిపెట్టిన కుస్తీలోనే ఇలాంటి దారుణమైన పరిస్థితి ఉందంటే, ఇతర క్రీడల్లో పరిస్థితిని ఇట్టే ఊహించుకోవచ్చు. 72 గంటల్లో సమాధానం చెప్పాలంటూ కుస్తీ సమాఖ్యకు క్రీడాశాఖ తాఖీదు ఇచ్చింది. కానీ, బ్రిజ్‌ను తొలగించాలి, అథ్లెట్లతో మర్యాదగా ప్రవర్తించాలి, సమాఖ్యను సమూలంగా మార్చాలి లాంటి ఆటగాళ్ళ కనీస డిమాండ్లు తీర్చలేనివేమీ కావు.

ఆ మాటకొస్తే సమాఖ్యలో ఇష్టారాజ్యంగా నియమాలు మారుస్తున్నారనీ, తమపై అనవసరమైన అధిక నిఘా ఉంచుతున్నారనీ అథ్లెట్లు చేస్తున్న ఆరోపణలకు బ్రిజ్ బృందం జవాబివ్వాల్సి ఉంది. కానీ, వేధింపుల బాధితులు బాహాటంగా చెప్పాలనీ, సాక్ష్యాలతో నిరూపిస్తే ఉరిశిక్షకైనా సిద్ధమనీ ఆయన అనడం చట్టం ముందూ నిలవని బుకాయింపే. ఇదంతా కాంగ్రెస్ నిర్వాకమనే ఆరోపణ, యూపీ వర్సెస్ హర్యానా వాదన అలాంటివే.

ఆరోపణలు హొరెత్తుతున్నా బ్రిజ్ రాజీనామా చేయకపోవడం విడ్డూరం. ఇక స్వయంగా క్రికెట రైన క్రీడామంత్రి అనురాగ్ ఠాకూర్ రెండోరోజు రాత్రి దాకా నోరెందుకు విప్పలేకపోయారో అర్థం కాదు. ఇన్నేళ్ళుగా కుస్తీ సమాఖ్య సహా అనేక చోట్ల లైంగిక వేధింపుల విచారణ కమిటీలు పెట్టకున్నా ఎలా చూస్తూ కూర్చున్నారో తెలీదు. పాలకులు పతకాల విజేతలతో ఫోన్‌లో మాట్లాడుతూ, ఫోటోలకు పోజులిస్తే చాలదు. బేటీ బచావో... మాటల్లో కాదు, చేతల్లో చూపాలి. దేశవ్యాప్తంగా బ్రిజ్ కనుసన్నల్లో సాగుతున్న సమాఖ్య కార్యవర్గాలన్నిటినీ రద్దు చేయాలి. నిపుణులు సారథ్యం వహించాల్సిన క్రీడాసంస్థల్ని ఇకనైనా రాజకీయాలకూ, ఇలాంటి రాజకీయవాదులకూ దూరంగా ఉంచాలి.

అథ్లెట్ల నిరసనకు తలొగ్గి, సమాఖ్యలో అక్రమాలను విచారించడానికి క్రీడాశాఖ త్రిసభ్య సంఘం వేసిందట. అయితే, అది చాలదు. వేధింపులతో వ్యవహారం బరి దాటి నేరాల గిరిలోకి చేరింది. దీనిపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు జరపించాల్సిందే, వ్యవస్థను సమూలంగా ప్రక్షాళించాల్సిందే. ధర్మం కోసం, న్యాయం కోసం... కడకు కనీసపాటి గౌరవం కోసం మహిళలు ఇవాల్టికీ వీధికెక్కాల్సి వస్తోందంటే అది మన దేశానికే అవమానం.

అంతర్జాతీయ బరిలో విజేతలైన ఈ వీరాంగనలు ఈ ఆత్మగౌరవ దంగల్‌లోనూ విజయం సాధించాలి. సమాజంలో పురుషోన్మాద దృక్పథాన్ని మార్చాలి. ఆటల గద్దెపై రాజకీయ గద్దలకు పని లేకుండా క్రీడాసంస్థలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు రావాలి. నిజాయతీ ఉంటే... ఎప్పుడో కాదు, ఇప్పుడే ఆ విధానపరమైన మార్పులకు పాలకులు నడుం బిగించాలి.

## జిల్లాలో అనీమియా నివారణ కు సూక్ష్మ స్థాయి లో చర్యలు తీసుకోవాలి

### - ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేయాలి - సమీర్ శర్మ



**(వి న్యూస్ మచిలీపట్నం):** గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలలో అనీమియా నివారణకు సూక్ష్మ స్థాయిలో చర్యలు తీసుకోవాలని తద్వారా ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి చేయాలని సీఈఓ టు సీఎం డా. సమీర్ శర్మ అన్నారు. సీఈఓ టు సీఎం డా.సమీర్ శర్మ శుక్రవారం కృష్ణాజిల్లాలో పర్యటించారు. తొలుత కలెక్టరేట్ సమావేశపు హాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి 8 ప్రధాన సూచికలలో జిల్లా ప్రగతి సమీక్షించారు. జిల్లాలో మండల వారీ, సచివాలయాల వారీ గర్భవతులు, బాలింతలు, 10–19 సం. మధ్య వయస్సు గల కిశోర బాలికలు, వారిలో అనీమియా బాధితులు, జగనన్న గోరుముద్ద, బాలామృతం వంటి పథకాల కింద అనీమియా బాధితులకు అందిస్తున్న పౌష్టికాహారం, అనీమియా నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సమీర్ శర్మకు పవర్పాయింట్ ప్రజెంటేషన్ సమర్పించారు. తొలుత జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాల విభజన అనంతరం కృష్ణాజిల్లా 3 రెవెన్యూ డివిజన్లు, 25 మండలాలతో ఏర్పడిందని, 17.35 లక్షల జనాభా ఉందని, 104 వార్డు సచివాలయాలు, 404 గ్రామ సచివాలయాలు ఉన్నాయన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి ప్రధాన సూచికలలో మెరుగైన లక్ష్య సాధనకు తీసుకుంటున్న చర్యలు కలెక్టర్ వివరించారు. జిల్లాలో గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలకు నూరు శాతం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సచివాలయాల వారీగా సర్వే నిర్వహించి ఎనీమిక్ బాధితులను గుర్తించి వారికి అవసరమైన పౌష్టికాహారం, విటమిన్స్ అందేలా చూస్తున్నట్లు తెలిపారు. మండలాల వారీగా కమిటీలు ఏర్పాటు చేశామని, అనీమియా నివారణకు తీసుకుంటున్న చర్యలపై ప్రతి వారం సమీక్షించాలని ఎంపీడీ ఓలను ఆదేశించారు. డా.సమీర్ శర్మ మాట్లాడుతూ ముఖ్యంగా అనీమియా బాధితులలో సివియర్ కేసులపై దృష్టి సారించి వారిలో ఎనీమిక్ నివారింపబడుటకు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాల వారీగా అనీమియా బాధితులపై ఫోకస్ పెట్టి ప్రతి ఒక్కరూ అనీమియా నుండి నివారణ పొందేంతవరకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. జిల్లాలో 10–19 సం. మధ్య వయస్సు గల కిశోర బాలికలు 78,138 కాగా వీరిలో ఎనీమిక్ 61.67 శాతం కాగా 20 శాతానికి తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. 15–49 సం. మధ్య వయస్సు గల మహిళల్లో గర్భవతులు 12 వేల మందికి పైగా ఉన్నారని, వారిలో ఎనీమిక్ గత అక్టోబర్ మాసంలో 39.38 శాతం కాగా, డిసెంబర్ నాటికి 32.14 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. 0–5 సం. పిల్లల్లో ఎత్తు తక్కువ గల వారు 4,352 మంది, బరువు తక్కువ పిల్లలు 2,585 మందిని గుర్తించగా, వీరికి వైయస్ఆర్ సంపూర్ణ పోషణ పథకర కింద పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 1–8 తరగతులలో గుర్తించిన డ్రాప్‌అవుట్స్ 1,969 మంది విద్యార్థులు కాగా, వీరి తల్లిదండ్రులకు తగిన కౌన్సిలింగ్, అవగాహన కల్పించడం ద్వారా 352 మందిని తిరిగి తరగతుల్లో చేర్పించినట్లు, మిగతా వారిని కూడా బడిలో చేర్పించుటకు ముమ్మర చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పాఠశాల విద్యార్థుల్లో 27,406 మందిని ఎనీమిక్ గా గుర్తించగా, మైల్డ్ ఎనీమిక్ 11,994, మోడరేట్ 15,320 కాగా, సివియర్ ఎనీమిక్ 92 మంది కాగా, వీరిలో ఎనీమిక్ నివారణకు దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా మచిలీపట్నం, పామర్రు, తోట్లవల్లూరు, ఉయ్యూరు మండలాల్లో ఎనీమిక్ ఎక్కువగా ఉన్నందున ఆయా మండలాల ఎంపీడీఓలు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలతో సమీర్ శర్మ వీసీ ద్వారా మాట్లాడి అనీమియాకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ మాట్లాడుతూ సచివాలయాల వారీగా కిశోర బాలికల్లో సివియర్ ఎనీమిక్ బాలికలపై దృష్టి సారించాలని వారిలో ఎనీమిక్ నివారణ అయ్యేంత వరకు వారికి అవసరమైన పౌష్టికాహారం అందిస్తూ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎనీమిక్ నివారణకు వారిలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో నిర్వహిస్తున్న గ్రామదర్శిని కార్యక్రమం గురించి కలెక్టర్ సమీర్ శర్మకు వివరించారు. జిల్లాలో 75 మంది ప్రత్యేక అధికారులను నియమించామని, జిల్లాలో ఇప్పటి వరకు మూడు విడతల్లో 225 గ్రామాలు కవర్ చేశామన్నారు. గ్రామదర్శినిలో గుర్తించిన సమస్యలకు తక్షణ పరిష్కార చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, డిఎంఅండ్ హెచ్ డా. గీతాబాయి, డిఇఓ డా.శర్మిష్ట, ఐసిడిఎస్ పీడీ ఎస్.సువర్ణ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి, పీడీ డ్వామా జివి. సూర్యనారాయణ, పీడి డిఆర్డిఏ పీఎస్ఆర్.ప్రసాద్, డిపిఓ నాగేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో కాలుష్య నివారణా చర్యలు ముమ్మరం చేయాలి

**(వి న్యూస్ మచిలీపట్నం):** సీఈఓ టు సీఎం , రాష్ట్ర కాలుష్య నియంత్రణా మండలి చైర్మన్ డా.సమీర్ శర్మ శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్లో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాతో కలసి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికంగా కాలుష్యాన్ని విడుదల చేసే పరిశ్రమలకు నోటీసులు జారీచేయడం, కాలుష్య నివాణా చర్యలు తీసుకొనేలా చూడాలన్నారు. ఆసుపత్రుల్లో బయో మెడికల్ వేస్ట్ నిర్వహణ పటిష్టవంతంగా అమలయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పటిష్టంగా అమలయ్యేలా చూడాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఐటమ్లను నిషేధించడం మరియు కవర్ల యొక్క కనీస మందాన్ని నిర్దేశించడం తప్పని సరి చేస్తూ 2021, ఆగస్టు 12 కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ కాలుష్య నియంత్రణ మండలి సింగిల్ యూజ్ ప్లాస్టిక్న నిషేధిస్తూ 2022, జూన్ 30న ఆదేశాలు జారీ చేసిందన్నారు. నిషేధిత జాబితాలోని ప్లాస్టిక్ వస్తువులు ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ఫోర్కు, స్పూన్లు, చాకులు, ప్లాస్టిక్ గడ్డి, ప్లాస్టిక్ ట్రేలు, ప్లాస్టిక్ పేపర్ తో ప్యాకింగ్ చేయడం, 100 మైక్రాన్ల కంటే తక్కువ ప్లాస్టిక్ లేదా పీవీసీ బ్యానర్లు, స్టికర్లు అదేవిధంగా 120 మైక్రాన్ల మందం గల కవర్ల నిషేధం




2023, జనవరి 1 నుండి అమల్లోకి వచ్చిందన్నారు. పర్యావరణ పరిరక్షణ చట్టం – 1986 కింద రాష్ట్రంలో గత నవంబర్ 1 నుండి ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్లను నిషేధించగా, తదుపరి ఈ నెల 26వ తేదీ వరకు నిషేధిత తేదీ పొడిగించడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీ మెటీరియల్ను క్షీణింప చేయడానికి వేల సంవత్సరాలు పట్టిందని, కాల్చినప్పుడు విషపూరితమైన పొగలు పర్యావరణంలోకి విడుదలై ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం ఉంటుదని, ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్ల ప్రింటింగ్ ప్రెస్లను ఆపరేట్ చేయవద్దని ఆదేశించారని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ఫ్లెక్స్ ప్రింటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సమీర్ శర్మ, కలెక్టర్ ను కలసి తమ సమస్యలు వివరిస్తూ మెమోరాండమ్ సమర్పించారు. ఈనెల 26 నుండి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం అమలు చేయకుండా గడువు ఇప్పించాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్లో చేర్చిన ప్రతి వస్తువుకు ప్రత్యామ్నాయ వస్తువు అందుబాటులో ఉందని కాని ఫ్లెక్సు ప్రత్యామ్నాయం ఇంకా అందుబాటులో లేదని ప్రతినిధులు వివరించారు. ఫ్లెక్స్ బ్యానర్లకు ప్రత్యామ్నాయం క్లాత్ బ్యానర్ల పై ప్రింటింగ్ వేయాలంటే ప్రస్తుత మిషనరీ అప్గ్రేడ్ కొరకు సబ్సిడీపై ఋణాలు ఇప్పించాలని, ఫ్యాబ్రిక్ మెటీరియల్ రాష్ట్రం మొత్తానికి సరిపడు పరిమాణంలో ముందుగానే అందుబాటులోకి తేవాలని సమీర్ శర్మను కోరారు.

అనంతరం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధిత జాబితా మరియు ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్స్ నిషేధంపై అవగాహన కల్పించేందుకు కాలుష్య నియంత్రణ మండలి ముద్రించిన పోస్టర్ ను సమీర్ శర్మ, కలెక్టర్ విడుదల చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్, కాలుష్య నియంత్రణ మండలి జోనల్ అధికారి ఎన్.భాస్కరరావు, ఈఈ టి.ప్రసాదరావు, పరిశ్రమల శాఖ జీఎం ఆర్ . వెంకట్రావు, ఎస్ఈ ఈ కె.రమేష్, మున్సిపల్ కమీషనర్లు, డిఆర్ డిఎ పీడి పి.ఎస్.ఆర్.ప్రసాద్, డిపిఓ నాగేశ్వర నాయక్, డిఎం అండ్ హెచ్ డా.గీతాబాయి తదితరులు పాల్గొన్నారు.

## ఒకేసారి వందశాతం మద్య నిషేధం.. మేం అనలేదు: డిప్యూటీ సీఎం

**విశాఖపట్నం:** మద్య నిషేధంపై ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు కొత్త భాష్యం చెప్పారు. శుక్రవారం విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వందశాతం ఒకేసారి మద్య నిషేధం చేస్తామని ఎప్పుడూ చెప్పలేదని, నియంత్రణ అంచెలంచెలుగా చేస్తామన్నారు. కొత్తగా బార్లకు లైసెన్స్‌లు ఇచ్చినంత మాత్రాన అవి పెరిగినట్టు కాదని, ప్రస్తుతం ఉన్న వాటిలోనే సర్దుకుని వెళ్తున్నామన్నారు. చాలా వరకు నియంత్రణ చేసి వాటిలో మాత్రమే కొత్త బార్లకు అనుమతిచ్చామన్నారు. "2024లో ఏం చేస్తామో చూడండి.. ఆ విషయం ప్రజలకే చెబుతాం. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడికి ఏమైనా పిచ్చి పట్టిందా.. పోలీసులను హింసిస్తానని చెబుతున్నారు. అప్పుడే ఎన్నికలు జరిగిపోయినట్టు, ఆయనకు మంత్రి పదవి వచ్చినట్టు భావిస్తున్నారు. అయ్యన్న నోరు అదుపులో పెట్టుకోవాలి. నర్సీపట్నంలో గెలవలేనని తెలిసి పిచ్చి ప్రేలాపనలు, సైకో మాటలు మాట్లాడుతున్నారు" అని మండిపడ్డారు.

## ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన నిధులను గిరిజన ప్రాంతాలలో రోడ్ల నిర్మాణానికి, అభివృద్ధికి వినియోగించండి

### - అధికారులను ఆదేశించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్

**(విన్యూస్, విజయవాడ):** ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ఏరియా భూ బదలాయింపు నిబంధనలు, ఆర్ & ఎఫ్ఆర్ చట్టం ప్రకారం గిరిజనులకు పట్టాల పంపిణీతో పాటు అన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులను సూచించారు. శుక్రవారం పాణ్యం మండలంలోని నెరవాడ మెట్ట సమీపంలోని ఏపీ గిరిజన బాలికల పాఠశాలలో గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ పాల్గొన్నారు.

జిల్లా ఇన్చార్జ్ మంత్రి మరియు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా, ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర, జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్, గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు ఎం. జాహ్నవి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి, ప్రభుత్వ విప్ గంగుల ప్రభాకర రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాఖ్ బాషా, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే బ్రిజేంద్రనాథరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూర్ ఆర్థర్, మునిసిపల్ చైర్పర్సన్ మాబున్నిషా,ఎస్సి, ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ జిల్లాధికారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ మాట్లాడుతూ గిరిజనులలి లిసంక్షేమం, వారి అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని అటవీ హక్కుల చట్ట ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికి సాగు చేసేందుకు పట్టా భూములు పంపిణీ చేయాలని అధికారులను సూచించారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద అందించిన నిధులను గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాలలో రోడ్ల నిర్మాణానికి మరియు అధిక ప్రాధాన్యత ప్రాతిపదికన రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారులను కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన ప్రాంతాల్లో ఇది నా మూడవ పర్యటనని, మిమ్మల్ని వ్యక్తిగతంగా కలవడం, ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. తాను 95.90 లక్షల గిరిజన జనాభా కలిగిన ఒడిశా రాష్ట్రం నుండి వచ్చానన్నారు. రాష్ట్ర జనాభాలో 22.8 శాతం ఉన్నందున, ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తనకు తెలుసున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో, షెడ్యూల్డ్ తెగల జనాభా 27.39 లక్షలు, రాష్ట్ర మొత్తం జనాభాలో 5.53% వుందన్నారు.

మన రాష్ట్రంలో, ప్రాథమికంగా 5 జిల్లాల్లో విస్తరించి ఉన్న మొత్తం 34 గిరిజన సమూహాలలో, 7 గిరిజన సమూహాలు ప్రత్యేకించిలి లిబలహీన గిరిజన సమూహాలుగా వర్గీకరించబడ్డాయన్నారు. వేల సంవత్సరాలుగా వస్తున్నలి లిగిరిజన సంస్కృతి మరియు సంప్రదాయాలు, వారి జీవన విధానం నుండి మనం సుస్థిరత యొక్క గొప్ప పాఠాన్ని నేర్చుకుంటామన్నారు. గిరిజన జనాభాను ఆధునిక సమాజంలోకి తీసుకురావడం, అదే సమయంలో వారి సాంప్రదాయ సంస్కృతిలి లిమరియు ప్రత్యేక పద్ధతులను కాపాడుకోవడం మధ్య సమతుల్యతను సృష్టించడం ప్రభుత్వానికి అతిపెద్ద సవాలుగా వుందన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో ముఖ్యంగా కొండ ప్రాంతాలలో నివసించే ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానంగా వైద్యం, విద్య, రోడ్డు, త్రాగునీటి సౌకర్యాలు, కమ్యూనికేషన్ తదితర సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తాగునీరు, రోడ్డు కనెక్టివిటీ, విద్యుదీకరణ, మైనర్ ఇరిగేషన్ అభివృద్ధి, వ్యవసాయ ఇన్‌పుట్‌లు, సమగ్ర శిక్షణా కార్యక్రమాలు, మైనర్ అటవీ ఉత్పత్తుల పునరుత్పత్తి, కాఫీ మరియు మిరియాలు అభివృద్ధి మొదలైనవాటిని అధిక ప్రాధాన్యతా రంగాలుగా గుర్తించి చేపట్టిందన్నారు.

గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక విద్య మరియు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయడంపై కూడా ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ఆరోగ్యం మరియు విద్య అత్యంత ముఖ్యమైన అంశాలు. గిరిజన గ్రామాలలో నివసించే ప్రజలకు పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం మరియు ఆహారం తగినంత అందుబాటులో ఉన్నాయన్నారు. కొన్ని గిరిజన గ్రామాల్లో పరిస్థితులలి లిఅందుబాటులో లేనందున ప్రాథమిక సేవలు అందడం లేదన్నారు.ఏజెన్సీ గ్రామాల్లో పరిశుభ్రత, పౌష్టికాహారం, శిశు, తల్లీబిడ్డల



ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు, గర్భిణులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిపై అవగాహన కల్పించేందుకు శిక్షణ పొందిన ఆరోగ్య కార్యకర్తలను నియమించాలన్నారు. ప్రతిరోజూ మూడు లేదా నాలుగు గిరిజన గ్రామాలను ఒక డాక్టర్ సందర్శించేలా వైద్య శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే ఉచిత విద్యాలి లిసౌకర్యాలపై గిరిజన జనాభాలో అవగాహన లేకపోవడం వల్ల పిల్లలు సక్రమంగా హాజరుకావడం లేదన్నారు. భారత ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రజలకు విద్యను అందించడానికి ఆర్థికలి లిసహాయం మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ఇందులో భాగంగానే గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, ఏకలవ్య ఉన్నత పాఠశాలలు మొదలైనవి ప్రారంభించబడ్డాయని గవర్నర్ తెలిపారు. పిల్లలను పాఠశాలలకు పంపి ప్రభుత్వం అందించే విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలు చదువుకుంటే మంచి ఉపాధి అవకాశాలను పొంది దేశానికి సేవ చేయగలరని అన్నారు. సరైన రహదారి కనెక్టివిటీ లేకపోవడం వల్ల, గిరిజన ప్రాంతాలలోని మారుమూల ప్రాంతాలలో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులను తాత్కాలిక డోలీలలో సమీప ప్రజారోగ్య కేంద్రానికి తీసుకెళ్లే పరిస్థితులు అగుపడుతూనే ఉంటాయన్నారు. ప్రముఖ గిరిజన ప్రాంతాలలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ మరియు మెడికల్ కాలేజీలను స్థాపించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందన్నారు.లి లిఉన్నత విద్యా కోర్సులు, స్కిల్ డెవలప్‌మెంట్‌ను అభ్యసించడానికి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలనులి లిగిరిజన యువత వినియోగించుకోవాలన్నారు. గిరిజన యువత రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని ఉపాధి పొందేందుకు అవసరమైన నైపుణ్యాలను సమకూర్చుకోవాలన్నారు.

# గడప గడపకు మన ప్రభుత్వంతో సంక్షేమ పథకాల్లో జవాబుదారితనం : మంత్రి జోగి రమేష్



**(వి న్యూస్ బంటిమిల్లి):** రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తూ సంక్షేమ పథకాల పట్ల జవాబుదారీతనంగా ఉంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన కృత్తివెన్ను మండలంలోని ఒంటిల్లు, శీతనపల్లి బంటుమిల్లి మండలంలోని ఆముదాలపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని గ్రామస్థులకు వివరిస్తూ కరపత్రాలను అందించారు. ఇంటింటిని సందర్శిస్తూ ప్రతి ఒక్కరినీ మంత్రి ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుకు జవాబుదారీ వహిస్తూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. దీని ద్వారా అర్హులైన ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి ఇదొక గొప్ప అవకాశమని, అధికారుల సమక్షంలో అట్టి వారికి లబ్ధిని చేకూర్చడం జరుగుతుందన్నారు. ఇది సంక్షేమాభివృద్ధి రథసారథి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఘనత అని మంత్రి కొనియాడారు. మంత్రి ఇంటింటిని సందర్శిస్తూ పథకాల లబ్ధిని వివరించడంతో పాటు గ్రామస్తుల సమస్యలను సావధానంగా ఆలకిస్తూ అక్కడిక్కడే పరిష్కారం అయ్యే విధంగా కృషి చేశారు. గ్రామంలో డ్రైనేజీ, రోడ్ల నిర్మాణంతో పాటు జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా రోడ్ల పక్కనున్న చెత్త తరలింపునకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. శీతనపల్లి గ్రామానికి చెందిన వికలాంగురాలైన గంటా జ్యోతి కి మూడు చక్రాల సైకిల్ ను తక్షణమే అందించాలని అధికారులకు సూచించారు. శీతనపల్లిల్లో గ్రామస్తుల అభ్యర్థన మేరకు చర్చ్ నిర్మాణానికి తన వంతు సాయంగా రూ.లక్ష అందిస్తామని మంత్రి హామీ ఇవ్వడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అదే గ్రామంలో త్వరలో పాఠశాల నిర్మాణం చేపడతామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. గ్రామంలోని అంగనవాడీ, ఎలిమెంటరీ పాఠశాల చిన్నారులతో ముచ్చటించి మధ్యాహ్నం భోజనంపై మంత్రి ఆరా తీశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఆయన రుచి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కృత్తివెన్ను, బంటుమిల్లి జెడ్పీటీసీ లు మైలా రత్న కుమారి, మలిసెట్టి వెంకట రమణ, కృత్తివెన్ను, బంటుమిల్లి ఎంపిడిఓ లు పిచ్చిబాబు, స్వర్ణ భారతి, తాసిల్దార్లు రామకోటేశ్వరరావు, సత్యనారాయణ, సర్పంచ్ లు కూనసాని సునీత, దాసరి సియోన్ కుమారి, ఎంపిపి లు గరుడ ప్రసాద్, వెలివెల చినబాబు, పెడన మున్సిపాలిటీ కౌన్సిలర్ బళ్ల గంగయ్య, వైసీపీ మండల కన్వీనర్ ఎం రాజబాబు, వైసీపీ మండల మహిళా కన్వీనర్ ఝాన్సీ, వివిధ శాఖల అధికారులు, వైయస్సార్ పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మేం రాష్ట్ర ప్రభుత్వానికి దగ్గర కాలేదు ఏపీఎన్జీవో అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు

**విజయవాడ:** రాష్ట్ర ప్రభుత్వం 2018 నుంచి డీఏ, ఇతర బకాయిలను చెల్లించలేదని ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు అన్నారు. ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నందుకు ఉద్యోగ సంఘాల నేతలుగా సిగ్గు పడుతున్నామన్నారు. వేతనాల కంటే ముందు పెన్షన్ ఇవ్వాలని కోరుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం మర్యాద నిలబెట్టుకోవాలని బండి శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ ఎన్జీవో కార్యవర్గంతో పాటు జేఏసీ సమావేశాల్లో చర్చించి తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి దగ్గర కాలేదని.. ఉద్యోగుల ప్రయోజనాల కోసమే పోరాడుతోందని బండి శ్రీనివాసరావు చెప్పారు. ఉద్యోగుల సమస్యలను గవర్నర్ దగ్గర చెప్పుకోవాలి తప్ప.. ఇతర సంఘాల గురించి ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందో చెప్పాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) అధ్యక్షుడు సూర్యనారాయణను ఉద్దేశించి ఆయన ప్రశ్నించారు. ఏపీ ఎన్జీవో సంఘం చాలా ఏళ్ల క్రితం ఏర్పడిందన్నారు. ఏపీజీఈఏకు అనుమతి ఎలా వచ్చిందో అందరికీ తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. ఏపీ ఎన్జీవో సంఘం సాధించిన కారుణ్య నియామకాల ఉత్తర్వుల ద్వారానే సూర్యనారాయణకు ఉద్యోగం వచ్చిందన్నారు. సూర్యనారాయణ అధ్యక్షత వహిస్తున్న సంఘం గుర్తింపు రద్దు చేయాలని సీఎస్‌ను కోరతామన్నారు. ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని చట్టాలు, నిబంధనలు ఉన్నాయని.. కానీ ప్రభుత్వం పాటించడం లేదని బండి శ్రీనివాసరావు అన్నారు.

V స్మార్ట్ యాడ్స్

**Insurance**
యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అన్ని రకాల వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించబడును. ఇన్సూరెన్స్ చేయించుకోదలచిన వారు సంప్రదించండి: టి.సి.ఎన్ శ్రీనివాస్.
9246761404
08672-221097

**మస్కిటో డోర్స్&విండోస్**
చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్... అల్యూమినియమ్ మస్కిటో డోర్స్&విండోస్ తయారు చేయబడును. మరియు రిపేర్ చేయబడును.
సంప్రదించండి: చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్
గొడుగుపేట-మచిలీపట్నం
సెల్:9182197822
9121605277

**అద్దెకు ఇవ్వబడును**
జిల్లా కోర్టు సాయిబాబాగుడి ఎదురురోడ్డులో తూర్పు ఫేస్‌లో 1,2 ఫ్లోర్లలో కమర్షియల్ స్పేస్ అద్దెకు ఇవ్వబడును. బ్యాంకులకు, డాక్టర్లకు మొ॥లగు వారు సంప్రదించండి. లిఫ్ట్ సౌకర్యం కలదు.
సంప్రదించండి:
7997883575
9347576464
9515237110

వి స్మార్ట్ యాడ్స్ కేవలం రూ.100/-లకే స్మార్ట్ యాడ్..
సంప్రదించండి 9848667347



ఆర్గానిక్ తేనె
మచిలీపట్నంలో... ఆర్గానిక్ తేనె కోసం సంప్రదించండి: 7981850205

**మచిలీపట్నం పరిసర ప్రాంత ప్రజలకు సదవకాశం**
వాటర్ సర్వీసింగ్ & ఇంజన్ ఆయిల్ (జనరల్ సర్వీస్‌తో)
కేవలం రూ. 449/-లకే
బైక్ జాబ్ కార్డు ఇవ్వబడుతుంది.
ప్రతి ఒక్కరు ఈ అవకాశమును వినియోగించుకోవలసినదిగా మనవి.
నందిని ఆటోమొబైల్
అన్నిరకముల టూవీలర్ స్పేర్ పార్ట్స్ & ఇంజన్ ఆయిల్స్ మరియు టైర్లు లభించును.
సెల్ : 7396 7396 79
నవరంగ్ ఆటో కన్సల్టెన్సీ
లక్ష్మీటాకీస్ సెంటర్, డి-మార్టు రోడ్, మచిలీపట్నం - 521 002.
సెల్ : 9848520822


**శ్రీ శివరామకృష్ణ జ్యోతిష్యాలయము**
శంకర మఠం ప్రక్కన, గొడుగుపేట, మచిలీపట్నం.
జాతక పరిశీలన చేసి వివాహ, ఉద్యోగ, వ్యాపార, సంతాన తదితర విషయాల్లో దోషాలకు పరిహారాలు సూచింపబడును.
వివాహ పొంతన పరిశీలింపబడును. సుముహూర్త నిర్ణయం చేయబడును.
సంప్రదించండి : 96407 54054-91828 17435

**అమ్మబడును**
మచిలీపట్నం శివారు రాడార్ కేంద్రం దగ్గర కళ్యాణీటౌన్‌షిప్‌లో 300గజాల ప్లాట్ అమ్మబడును.
కావల్సిన వారు సంప్రదించండి:
సెల్: 7032931205
సంప్రదించు వేళలు: ఉదయం11 - 2పిఎం

**వంట మనిషి కావలెను**
మచిలీపట్నం జల్దువారితోట డీమార్టు వెనుక నలుగురు గల కుటుంబంనకు వంట మనిషి కావలెను. (నాన్‌వెజ్)
సంప్రదించండి: (ఉదయం10 నుంచి2గంటల)
సెల్:7032931205

**స్థలం అమ్మబడును.**
డోకిపర్రు వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో నిడుమోలు-కౌతవరం మెయిన్ రోడ్డులో 16సెంట్ల భూమి అమ్మకానికి కలదు. 60-120 సైజులో గల కమర్షియల్ భూమి కావల్సిన వారు వెంటనే సంప్రదించండి:
సంప్రదించండి:
7997883575
9347576464

**తక్కువధరకే ప్రకటనలు**
ఇల్లు/స్థలం అమ్మలన్నా, కొనాలన్నా, అద్దెకు ఇవ్వాలన్నా, ఉద్యోగం కావాలన్నా, ఉద్యోగులు కావాలన్నా తక్కువ ధరతో విన్యూస్‌లో ప్రకటన ఇచ్చి నిశ్చింతంగా ఉండండి.
మరిన్ని వివరాలకు సంప్ర: 9848667347

# విజ్ఞాన్స్ లారా విద్యార్థులకు బంగారు పతకాలు



**(వి న్యూస్ చేబ్రోలు):** చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులకు మూడు బంగారు పతకాలు లభించాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఫణీంద్రకుమార్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జేఎన్‌టీయూ కాకినాడ విడుదల చేసిన 2018%--%22 బ్యాచ్ ఇంజినీరింగ్ ఫలితాలలో తమ విద్యార్థులు వివిధ విభాగాలలో మూడు బంగారు పతకాలు సాధించారని వెల్లడించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన గొంటు యశ్వంత్ రెడ్డి అనే విద్యార్థి 9.17 సీజీపీఏతో టాపర్స్ విభాగంలో ఒక బంగారు పతకం, ప్రొఫెసర్. అల్లం అప్పారావు గోల్డ్ మెడల్ విభాగంలో మరొక బంగారు పతకముతో మొత్తం రెండు బంగారు పతకాలు సాధించారని పేర్కొన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో దేవరపాటి రాజ్యలక్ష్మి అనే విద్యార్థి 9.12 సీజీపీఏతో ఒక బంగారు పతకము సాధించందని తెలియజేసారు. విద్యార్థులు ఈ బంగారు పతకాలను జేఎన్‌టీయూ%--% కాకినాడ నిర్వహించబోయే 9వ స్నాతకోత్సవంలో అందుకోనున్నారని తెలిపారు. క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించటంతో పాటుగా పటిష్టమైన కౌన్సిలింగ్ విధానం వలన విద్యార్థులు ఈ ఘనత సాధించారని తెలియజేసారు. బంగారు పతకాలను సాదించిన విద్యార్థులను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఫణీంద్రకుమార్, ఆయా విభాగాల డీన్లు, విభాగాదిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే పరమవధిగా ముందుకెళుతున్న పత్రిక "వి న్యూస్" :ఘంటసాల, జయ మంగళ...






**(వి న్యూస్, మండవల్లి) :** స్థానిక మండల పరిధిలోని చింతపాడు, కొవ్వాడలంక గ్రామాల సర్పంచులు.. ఘంటసాల భాగ్యలక్ష్మి మరియు జయ మంగళ తిరుపతి వెంకన్న లు వారి వారి గ్రామ సచివాలయాల వద్ద "వి న్యూస్ 2023 క్యాలెండర్'' ను ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నవ సమాజ అభివృద్ధికి పునాదులు వార్తాపత్రికలుగా అభివర్ణించడం జరిగింది. ఈ సందర్భంగా "వి న్యూస్'' దినపత్రిక ప్రాముఖ్యతను తెలియజేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో తనదైన ముద్ర వేసుకున్న పత్రిక" వి న్యూస్" అని నొక్కి వక్కాణించడం జరిగింది. తనదైన శైలిలో ప్రత్యేక కథనాలను పాఠకులకు అందిస్తూ, ప్రజలను చైతన్య పరిచే సరళమైన దినపత్రిక వి న్యూస్ అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి. రత్నకుమారి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పలువురు వైసిపి నాయకులు, గ్రామ పెద్దలు , స్థానిక వి న్యూస్ దినపత్రిక ప్రతినిధి ఎన్. వి. ఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు ప్రజాసేవలో భాగస్వామ్యం కావాలి !! - ముఖ్యమంత్రి సీఈవో డాక్టర్ సమీర్ శర్మ



**(వి న్యూస్ మచిలీపట్నం):** మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు ప్రజాసేవలో భాగస్వామ్యం కావాలని మాజీ సీఎస్, ముఖ్యమంత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ సమీర్ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం కృష్ణా జిల్లా ముఖ్య కేంద్రమైన మచిలీపట్నం 9వ డివిజన్ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా, సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లను క్షుణంగా పరిశీలించారు. ప్రభుత్వ సేవలపై ఆరా తీశారు సచివాలయంలో అమలు చేస్తున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల తీరు ఆయన పరిశీలించారు. సమాజంలో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించాలని వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ ఆరిఫ్ కు ఆయన వివరించారు. 9 వ సచివాలయం పరిధిలో ఉన్న పలువురు గర్భిణీ మహిళలు, బాలింతలుతో మాట్లాడారు. వారికి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం ఏ విధంగా ఉందో ఏఎన్ఎం బి. రంగమ్మ ను అడిగి తెలుసుకున్నారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న వారికి పౌష్టికాహారం అందించడంతో పాటు వారిని ప్రతిరోజు శ్రద్ధగా పర్యవేక్షించాలని సూచించారు. వారికి అవసరమైన మందులు, సప్లిమెంట్స్ సక్రమంగా అందుతున్నాయో లేదో వారిని అడిగి తెలుసుకున్నారు. బడి ఈడు పిల్లలకు పౌష్టికాహారం ఏ విధంగా అందుతుందో అనే విషయంపై వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ రఫత్ సుల్తానాను ప్రశ్నించారు. అలాగే మానసికంగా పరిపక్వత చెందని 14 ఏళ్ల వయసున్న తుమ్మ వైష్ణవి అనే బాలిక ఆరోగ్యం పై వాకబు చేశారు, అలాగే 17 సంవత్సరాల గద్దల హర్షవర్ధన్ అనే యువకునితో డాక్టర్ సమీర్ శర్మ కాసేపు మాట్లాడారు. వారి ఇష్టాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. మాట్లాడడం రాని వైష్ణవికి స్పీచ్ థెరపీ నేర్పించేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ జి గీతా బాయి కు ఆయన ఆదేశించారు.

**జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషను అభినందించిన ప్రభుత్వ సీఈవో డాక్టర్ సమీర్ శర్మ**

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై కృష్ణాజిల్లా ఒక ప్రత్యేక సాఫ్ట్వేర్ ను రూపొందించి పలు ప్రాంతాల్లో ఎంతో సమర్థవంతంగా అమలు చేస్తూ, అందుకై కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా కార్యనిర్వాహణ తీరును ముఖ్యమంత్రి సీఈఓ డాక్టర్ సమీర్ శర్మ ప్రత్యేకంగా అభినందించారు. కృష్ణాజిల్లాలో మాదిరిగా రాష్ట్రంలో మిగిలిన జిల్లాల్లో సైతం ఇదే స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను అమలు చేసే విధంగా తాను రాష్ట్ర ఉన్నతాధికారులకు ఆదేశిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అందరికీ విద్య, బడి వయసు పిల్లలందరూ పాఠశాల కు వచ్చేలా సమగ్ర కార్యాచరణ, పురుషులతో సమానంగా మహిళలకు ఆర్థిక స్వాతంత్యం కల్పించడంతో పాటు ఆయా కుటుంబాలను పేదరికానికి దూరం చేసేందుకు వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి పథకాలను అమలు చేయడం, ఐదేళ్ల లోపు పిల్లలు ఉండే బరువు, మంచి ఆరోగ్యం,సంతోషకరమైన మానసిక స్థితి మానసిక స్థితి నాణ్యమైన నాణ్యమైన విద్య, పరిశుభ్రమైన నీరు, పరిశుభ్ర వాతావరణం,విద్యుత్ సౌకర్యం, మౌలిక వసతుల కల్పన జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక పురోగతి,అసమానతల తొలగింపు, పట్టణీకరణ, ప్రజలలో కొనుగోలు శక్తి, ఉత్పత్తి అవకాశాలు పర్యావరణ పరిరక్షణ, మత్స్య సంపద, పర్యావరణ పరిరక్షణ. భూపరిరక్షణ శాంతి. న్యాయం తదితర స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు కృష్ణాజిల్లాలో అమలవడం పట్ల డాక్టర్ సమీర్ శర్మ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు పి. రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ చంద్రయ్య, 9 వ డివిజన్ కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ జానకిరామ్, జిల్లా విద్యాశాఖ అధికారిణి తాహెరా సుల్తానా, డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర్ నాయక్, మచిలీపట్నం తహసిల్దార్ సునీల్ బాబు, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, ఐసిడిఎస్ పిడి సువర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కొలుసు పెద రెడ్డియ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మండలి బుద్ధప్రసాద్



**(వి న్యూస్ పెనమలూరు):** మాజీ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలుసు పార్థసారథిని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పరామర్శించారు. ఇటీవల ఆయన తండ్రి, మాజీ పార్లమెంటు సభ్యులు కొలుసు పెద రెడ్డియ్య యాదవ్ మరణించడంతో, శుక్రవారం మొవ్వ మండలం కారకంపాడు గ్రామంలోని ఆయన స్వగృహానికి వెళ్లి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

# రాజకీయాలకతీతంగా ఎన్టీఆర్ ను గౌరవించాలి : బొల్లా వెంకన్న




**(వి న్యూస్ బంటిమిల్లి):** తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, తెలుగు వారికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన మహోన్నత వ్యక్తి యుగపురుషుడు, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ డాక్టర్ నందమూరి తారక రామారావు కి రాజకీయాలకు అతీతంగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా " భారతరత్న" శత జయంతి ఉత్సవ కానుకగా ప్రకటించి తెలుగు ప్రజల కోరిక తీర్చాలని అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బొల్లా. వెంకన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి గౌరవించిన కేంద్ర ప్రభుత్వం " రిపబ్లిక్ డే" సందర్భంగా లి భారత రత్న ప్రకటించాలి. లేనిపక్షంలో ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజలు తమ నిరసనలు వ్యక్తం చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఎన్టీఆర్ అభిమానుల సంఘం తరపున కేంద్ర ప్రభుత్వానికి విన్నపం.

# నారా లోకేష్ యువగళం యాత్రను విజయవంతం చేస్తాం

## - గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు




**(వి న్యూస్ గుడివాడ) :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జనం కోసం యువగళం పాదయాత్రను చేపడుతున్నారని, ఈ యాత్రను విజయవంతం చేస్తామని కృష్ణాజిల్లా గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు చెప్పారు. శుక్రవారం గుడివాడ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో రావి మాట్లాడారు. రాష్ట్ర ప్రజల మద్దతుతో ఈ నెల 27వ తేదీ నుండి 400 రోజుల పాటు యువగళం పాదయాత్ర కొనసాగనుందని తెలిపారు. ఇప్పటికే వైసీపీ నేతలు జిమ్మిక్కులు చేయడం మొదలు పెట్టారన్నారు. యువగళం పాదయాత్ర పేరు చెబితేనే భయపడుతున్నారని అన్నారు. నారా లోకేష్ పాదయాత్ర జరిగి తీరుతుందని, ఖచ్చితంగా విజయవంతం చేస్తామన్నారు. రాష్ట్రంలో యువతకు న్యాయం చేసేందుకు నారా లోకేష్ పోరాడుతున్నారని తెలిపారు. యువగళం పాదయాత్రకు యువత మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం మళ్ళీ అభివృద్ధి పథంలో నడవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందు కోసం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం రావాలని ఆకాంక్షించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి టీడీపీ నాయకులు, కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురి చేస్తూనే ఉన్నారన్నారు. అక్రమ కేసులు బనాయించినా ఎక్కడా వెనక్కి తగ్గలేదన్నారు. ప్రజలు ఇచ్చిన ఒక్క అవకాశాన్ని జగన్మోహనరెడ్డి వినియోగించుకోలేదని అన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారన్నారు. ప్రజలపై ఎన్నో భారాలను మోపుతూ వస్తున్నారన్నారు. సైకో పాలన పోయి సైకిల్ పాలన రానుందని తెలిపారు. బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి వంటి అనేక కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించగలిగామని చెప్పారు. యువగళం పాదయాత్ర ద్వారా అన్నివర్గాల ప్రజల సమస్యలను నారా లోకేష్ తెలుసుకుంటారని అన్నారు. ఆ సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారం జరిగే విధంగా పోరాడటం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే రావి చెప్పారు.

# ఈ నెల 28 న నాగాయలంక మండలం లో రిజర్వ్ బ్యాంకు డిప్యూటీ గవర్నర్, నాబార్డ్ చైర్మన్ పర్యటన : ఎం పి బాలశౌరి

**(వి న్యూస్ నాగాయలంక):** రిజర్వ్ బ్యాంకు డిప్యూటీ గవర్నర్ ఏం. రాజేశ్వర రావు మరియు ఇటీవల నాబార్డ్ (నాబార్డ్ – నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్) చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కే.వి. షాజీ కృష్ణా జిల్లాలో ని అవనిగడ్డ నియోజకవర్గంలోని నాగాయలంక మండలంలో ఈ నెల 28వ తేదీ పర్యటించి అక్కడి మత్స్య కారులకు అవసరమైన రుణాలు మంజూరు చేస్తారని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి ఒక ప్రకటన లో తెలిపారు. భారత ప్రభుత్వం వారు సహకార్ సే సమృద్ధి పథకం లో భాగంగా కొన్ని సహకార గ్రామాలను ఎంపిక చేసి అక్కడున్న ప్రజలకు కో ఆపరేటివ్ సంస్థల ద్వారా వారికి అవసరమైన రుణ సహాయం చేస్తారు. అందుకోసం మోడల్ కో ఆపరేటివ్ విలేజ్ (ఎం సి వి %--% మోడల్ కో – ఓపెరటివే విల్జ్ ) పథకం కింద నాగాయలంక లో ఒక కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. కృష్ణా జిల్లాలో పేరెన్నికగన్న కే డి సి సి బ్యాంక్ లిమిటెడ్ కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వారు కొన్ని దశాబ్దాలుగా జిల్లా రైతాంగానికి ఎంతో రుణ సహాయం చేస్తున్నారు. ఈ బ్యాంకు కు గల 58 బ్రాంచీల ద్వారా, అలాగే జిల్లాలో వారికి గల 425 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రైతులకు గుర్తించి వారికి ఖరిఫ్ పంట రుణాలు మంజూరు చేయడం జరుగుతోంది. అదేవిధంగా ఈ బ్యాంకు యొక్క వార్షిక టర్న్ ఓవర్ 10 వేల కోట్లు దాటిన శుభ సందర్భంగా ప్రత్యేకంగా మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి చొరవ తీసుకొని రిజర్వ్ బ్యాంకు డిప్యూటీ గవర్నర్ , నాబార్డ్ చైర్మన్ లను కృష్ణా జిల్లాకు రప్పించి, అవనిగడ్డ నియోజకవర్గంలోని నాగాయలంక మండలం లోని మత్స్య కారులకు అనగా మత్స్య మిత్ర గ్రూపులకు పెద్ద ఎత్తున రుణ సహాయం చేయబోతున్నారు. అదేవిధంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫిష్ ఆంధ్ర పథకం కింద కొంత మంది లబ్దిదారులను గుర్తించి, వారిని ప్రోత్సాహించడం కోసం వారికి కూడా రుణ సహాయం చేయబోతున్నారు. జనవరి 28 వ తేదిన రిజర్వ్ బ్యాంకు డిప్యూటీ గవర్నర్ , నాబార్డ్ చైర్మన్ లు నాగాయలంక మండలం లో పర్యటించి అక్కడి స్థానిక మత్స్యకారులను కలుసుకొని అక్కడ గల 256 మత్స్య మిత్ర గ్రూపుల వారికి ఒక్కొక్క గ్రూపుకి 1 లక్ష రూపాయల చొప్పున 2 కోట్ల 56 లక్షల రూపాయల రుణ సహాయం, అలాగే ఫిష్ ఆంధ్ర పథకం కింద 13 మంది లబ్దిదారులకు ఒక్కొక్కరికి 3.25 లక్షల చొప్పున 43 లక్షల రూపాయల రుణ సహాయం అందజేయడమే కాకుండా,కే డి సి సి బ్యాంక్ లిమిటెడ్ కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వారు 10 వేల కోట్ల రూపాయల టర్న్ ఓవర్ దాటిన సందర్భంగా బ్రోచర్ ని ఆవిష్కరించడం, నాగాయలంక లో కే డి సి సి వారి నూతన శాఖను ప్రారంభించడం, అదే విధంగా నాగాయలంక ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్రంలో నూతనంగా నిర్మించబోతున్న షాపింగ్ కాంప్లెక్స్ కు శంఖు స్థాపన చేయడం చేస్తారని, ఆర్ బి ఐ డిప్యూటీ గవర్నర్ రేగులాటివే డెవలప్మెంట్ అఫ్ కో – ఓపెరటివే బాంక్స్ అనే అంశం పై ప్రసంగిస్తారని, నాబార్డ్ చైర్మన్ భారతదేశంలో గ్రామీణాభివృద్ధిలో, సహకార రంగం బలోపేతంలో నాబార్డ్ పాత్ర గురించి ప్రసంగిస్తారని, అనంతరం మత్స్యకారులతో మాట్లాడి వారి సాధకభాదకాలను తెలుసుకుంటారని, ఈ కార్యక్రమాలన్ని మచిలీపట్టణం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అధ్యక్షతన, స్థానిక శాసన సభ్యులు సింహాద్రి రమేష్ బాబు కే డి సి సి బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వర రావు, అప్కాబ్ ఎం డి . శ్రీనాద్ రెడ్డి , మత్స్య శాఖ కమిషనర్ కన్నబాబు పాల్గొంటారని , ఈ అవకాశాన్ని రుణ సహాయాన్ని అందరు మత్స్యకారులు అందిపుచ్చుకొని చేపల వేట నిమిత్తం వలల కోసం, మర పడవల కోసం, మోటారు పడవల కోసం , కేజ్ కల్చర్ కోసం ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని పార్లమెంట్ సభ్యులు ఆకాంక్షించారు.

# సామాజిక సమతుల్యతకై "వి న్యూస్ "దినపత్రిక చేస్తున్న కృషి అభినందనీయం: సర్పంచ్ భట్రాజు శివాజీ..



**(వి న్యూస్, కైకలూరు) :** స్థానిక మండల పరిధిలోని తామరకొల్లు గ్రామ సచివాలయం నందు, శుక్రవారం" వి న్యూస్ 20 23 క్యాలెండర్" ఆవిష్కరణ స్థానిక సర్పంచ్ భట్రాజు శివాజీ చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాజిక సమతుల్యతకై 'వి న్యూస్' దినపత్రిక చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన వి న్యూస్ దినపత్రిక ప్రాముఖ్యతను తెలియజేస్తూ, సరళమైన భాషలో, తనదైన శైలిలో ప్రత్యేక కథనాలను అందించడంలో 'వి న్యూస్' ముందు వరుసలో ఉండటం తమకు ఎంతో ఆనందంగా ఉందని తెలియజేయడం జరిగింది. రానున్న రోజుల్లో మరిన్ని ప్రజా శ్రేయస్సు కథనాలతో, వి న్యూస్ దినపత్రిక ముందుకెళ్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు, ఆయన తెలియజేశారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, పంచాయతీ కార్యదర్శి మేకారవికిరణ్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ పెద్దలు మరియు స్థానిక వి న్యూస్ దినపత్రిక ప్రతినిధి ఎన్.వి.ఆర్ పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# వార్తా ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్న పత్రిక "వి న్యూస్"

## - సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ..



**(వి న్యూస్, కలిదిండి) :** స్థానిక మండల పరిధిలోని కోరుకొల్లు గ్రామ సచివాలయం నందు, శుక్రవారం సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ చేతుల మీదుగా, "వి న్యూస్ 2023 క్యాలెండర్" "ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వార్తా ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్న పత్రిక" వి న్యూస్" అని కొనియాడడం జరిగింది. సామాజిక సమతుల్యతకు వార్తా పత్రికల పాత్ర అతి ముఖ్యమైనదని , వాటిలో" వి న్యూస్" తన పత్రిక తనదైన శైలిలో ముందుకు వెళ్తుందని ఉద్ఘాటించారు. రానున్న రోజుల్లో సామాజిక రుగ్మతలను కూకటి వేళ్లతో పెకిలించేలా మరింత పదునైన వార్తా కథనాలతో, వి న్యూస్ దినపత్రిక ముందుకెళ్లాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆవిష్కరణలో పంచాయతీ కార్యదర్శి రాగాల వెంకట ఉదయకుమార్, జనసేన నాయకులు బట్టు మహేష్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు స్థానిక వి న్యూస్ దినపత్రిక ప్రతినిధి ఎన్. వి. ఆర్ నాగరాజు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# గుండె నొప్పికి తక్షణ వైద్యం అత్యవసరం : డాక్టర్ ఆర్ రాధాకృష్ణ

**(వి న్యూస్ మచిలీపట్నం) :** లేడీ యంప్తుల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్ మరియు విజయవాడ రమేష్ హాస్పిటల్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కళాశాల ప్రాంగణంలో "తక్షణ వైద్య సహాయం పట్ల అవగాహన సదస్సు"ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆర్. రాధాకృష్ణ విద్యార్థినీ లకు గుండె , మెదడు వివిధ రకాల సంబంధిత వ్యాధులకు సంబంధించి ఇప్పుడు తక్షణమే ఏ విధంగా చికిత్స చేయాలి అనే విషయంపై చక్కని అవగాహన కల్పించారు. ముఖ్యంగా గుండె నొప్పి కలిగినప్పుడు మొదటి గంటను "గోల్డెన్ అవర్" గా పరిగణించి, తక్షణ వైద్యం అందించినప్పుడు ప్రాణహాని ఉండదని ఆయన తెలియజేశారు. ప్రతి ఒక్కరూ గుండె నొప్పి పట్ల అవగాహన పెంచుకోవాలని తెలియజేశారు. గ్యాస్ నొప్పికి గుండెనొప్పి కి మధ్య తేడా అవగాహన లోపంతో కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గాని పట్టణాల్లో గాని పాముకాటు కుక్క కాట్లు తక్షణమే వైద్యం చేయించాలని, నాటువైద్యాలకి తావు లేదని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజు వ్యాయామం నడక చేయాలని, పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని డాక్టర్ రాధాకృష్ణ అన్నారు. సాధ్యమైనంత వరకు చికెన్ మటన్ వంటి ఆహారాలకు దూరంగా ఉంటే మంచిదని సూచించారు. గుండెనొప్పి వచ్చిన వెంటనే తక్షణం చేయవలసిన చికిత్స గురించి ప్రాక్టికల్ గా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎన్ విజయశ్రీ, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరినాథ్ బాబు, రమేష్ హాస్పిటల్స్ మేనేజర్ మాణిక్యాలరావు పార మెడికల్ అధ్యాపకులు కిరణ్మయి, సాజిదా సుల్తానా, జ్యోతి, స్పందన , విద్యార్థినులు పాల్గొన్నారు.




# ఛార్జ్‌షీట్‌లను పబ్లిక్ డొమైన్‌లో ఉంచలేం : సుప్రీంకోర్టు

**ఢిల్లీ :** పోలీసులు, సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు క్రిమినల్ కేసుల్లో వేసే ఛార్జ్‌షీట్లపై భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. స్వేచ్ఛ పొందేందుకు అవి ప్రజా దస్త్రాలు కావని.. వాటిని జన బాహుళ్యంలో ఉంచలేమని స్పష్టం చేసింది. ఛార్జ్‌షీట్లు పౌరులందరికీ అందుబాటులో ఉంచాలని సౌరవ్ దాస్ అనే జర్నలిస్ట్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని విచారించిన జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సీటీ రవికుమార్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ విధంగా స్పందించింది.

'ఛార్జ్‌షీట్ అనేది ప్రజాదస్త్రం కాదు. దానిని ఆన్‌లైన్ వేదికల్లో అందుబాటులో ఉంచలేం. కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ)లోని నిబంధనలకు ఇది విరుద్ధం' అని సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం వెల్లడించింది. ఇందుకు సంబంధించిన విచారణను జనవరి 9నే ముగించింది. తీర్పును రిజర్వులో ఉంచిన సుప్రీంకోర్టు తాజాగా దానిని వెలువరించింది. ఈ సందర్భంగా ఎఫ్ఐఆర్‌లపై కీలక వ్యాఖ్యలు చేసిన సుప్రీం.. కేసుకు సంబంధం లేని అధిక ప్రసంగికులు, ఎన్జీవోలకు ఎఫ్ఐఆర్‌లను ఇవ్వడం దుర్వినియోగానికి దారితీస్తుందని మౌఖికంగా అభిప్రాయపడింది. అయితే, ఎఫ్ఐఆర్‌ను ఛార్జ్‌షీట్‌తో సరిపోల్చలేమని పేర్కొంది.

పిటిషినర్ తరపున వాదనలు వినిపించిన అడ్వొకేట్ ప్రశాంత్ భూషణ్.. సమాచారాన్ని స్వచ్ఛందంగా అందుబాటులో ఉంచడం ప్రతి ప్రభుత్వ విభాగం బాధ్యత అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఛార్జ్‌షీట్లలో కొంత సమాచారం లీక్ అవడం వంటివి అసత్య వార్తలు, గందరగోళానికి దారి తీస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఎవరు నిందితుడు, నేరాన్ని ఎవరు చేశారనే విషయాలను తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందని గుర్తుచేశారు. అయినా.. వీటిని పబ్లిక్ డొమైన్‌లో ఉంచలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

**Owned by EDITOR and Publisher: PREM NATH THOKALA, 26/152, Buttaipet, Machilipatnam, Krishna Dist.,Printed at Sri Lakshmi Ofset Printer binders, D.no : 32-26-126/13, opp BSNL Bhavan, Chuttagunta, Vijayawada-4. ph:08672 227347.,cell 9848667347 - RNI NO: APTEL/2015/65279**